క్లుప్తంగా

లలిత కళలకు పట్టం కట్టాలి



పురస్కారాలు ప్రదానం చేస్తున్న కె.కె.వర్మ

ఐ.పోలవరం: లలిత కళలకు పట్టం కట్టాలని సుప్రసిద్ధ చిత్ర కళాకారుడు, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ డాక్టర్ కె.కె.వర్మ పిలుపునిచ్చారు. ఐ.పోలవరంలో బుధవారం నిర్వహించిన సప్త కళా వేడుకల్లో వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్ కుమారి రావి బేబీ సత్యవాణికి శోభనాయుడు కళా కౌముది అవార్డును పీటీఎం సంస్థ ప్రదానం చేసింది. 20 మందికి కళారవళి పురస్కారాలు అందించారు. పీవీఆర్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఉంగరాల వెంకటేశ్వరరావు, గీతా బాబు ప్రసాద్, రాయపు రెడ్డి చిట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యతో ఇక్కట్లు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని కర్రిచెరువు ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురవడంతో లో ఓల్టేజీ సమస్య నెలకొని తీవ్ర ఇబ్బందులుపడుతున్నట్టు స్థానిక యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్రి చెరువులో పనిచేయని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బుధవారం వారు నిరసన తెలిపారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయకపోతే సబ్‌స్టేషన్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుంచే సుబ్బు, రొక్కాల బాబ్జి, ఈతకోట సతీష్, ఈతకోట నాగరాజు ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఉప్పలగుప్తం: భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నూకల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై సీహెచ్ రాజేష్ శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శక్తి యాప్ ప్రయోజనాలను విద్యార్థులకు ఎస్సై వివరించారు.

గోశాలకు విరాళం

అమలాపురం టౌన్: స్థానిక గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలకు పట్టణానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు శిరిగినీడి వెంకన్నాయుడు, ఈశ్వరి దంపతులు రూ.10 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రతినిధి నాయుడికి సత్కారం

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల కో ఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన పట్టణానికి చెందిన ఏబీ నాయుడిని కోనసీమ ఆహార నిధి సంస్థ ప్రతినిధులు అమలాపురంలో బుధవారం ఘనంగా సత్కరించి అభినందించారు. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ నాయుడికి మూడు ఉమ్మడి జిల్లాల స్థాయి కో ఆర్డినేటర్ పదవి రావడం అభినందనీయమని కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. కోనసీమ ఆహార నిధి సంస్థ ప్రతినిధులు వీరు గట్టెం, పోలిశెట్టి పవన్ మహేష్, వెదుళ్లపల్లి అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అమలాపురం రూరల్: భట్నవిల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తి గాయపడ్డారు. అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనంపై వెళుతున్న దొమ్మేటి వెంకటేశ్వరరావును ఎదురుగా వస్తున్న లోడు రిక్షా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాల పాలైన వెంకటేశ్వరరావును అమలాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్రంగి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి




కార్పెంటర్లతో కలసి సంఘీభావాన్ని తెలుపుతున్న మంత్రి సుభాష్

అమలాపురం టౌన్: వడ్రంగి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ (వడ్రంగి) అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సభకు మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్పెంటర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వడ్రంగి కార్మికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సభకు హాజరైన వడ్రంగి కార్మికులు రాష్ట్ర కార్పెంటర్ల అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తాటికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా గణాల సత్యసాయి ఎన్నికయ్యారు.

ముంచెత్తితే.. ముప్పే

- పాడైన అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు
- కొత్త తలుపుల ఏర్పాటుపై తాత్సారం
- వరి, ఆక్వా రైతుల ఆందోళన
- ప్రతిపాదనలకు కలగని మోక్షం
- గోపాయిలంక వద్ద పనులేవీ?



గోపాయిలంక వద్ద పాడైన అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్లు

అల్లవరం: రైతన్నలు ఏటా నష్టపోతున్నా గోపాయిలంక అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు కొత్త తలుపుల ఏర్పాటుపై అధికారులు తాత్సారం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు, ఎగువ ప్రాంతం వరద ఉధృతిని నిలువరించడంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు ఉన్న పాత తలుపులు విఫలమతున్నాయి. అమలాపురం, అయినవిల్లి, అల్లవరం మండలాల్లోని వేలాది ఎకరాల్లో ముంపు నీరు కుమ్మరి కాలువ ద్వారా ప్రవహించి అల్లవరం మండలం గోడితిప్ప పంచాయతీ పరిధిలోని గోపాయిలంక వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వైనతేయ నదిలో కలుస్తుంది. 2003లో గోపాయిలంక వద్ద నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్లు పాడై దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురవుతుంది. స్లూయిజ్ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు తాత్కాలిక మరమ్మతులు మినహా పూర్తి స్థాయి మరమ్మతులు నిర్వహించలేదు. దీంతో షట్టర్లు పాడై ముంపునకు ప్రతిబంధకంగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటి ఆధారంగా షట్టర్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుని, నీటి లెవెల్ తగ్గిన తర్వాత మూసుకునేలా నిర్మించారు.

పాడైన ఆటోమెటిక్ గేట్లు

తాడికోన, గూడాల, కోడూరుపాడు గ్రామాల మీదుగా దేశికోడు డ్రెయిన్ గుబ్బలవారిపాలెం వద్ద కుమ్మరి కాలువలో కలుస్తుంది. ఈ రెండు డ్రెయిన్ల పొడువునా వందలాది ఎకరాల్లో వరి, ఆక్వా సాగు చేస్తున్నారు. వీటి నుంచి వస్తున్న ముంపు నీరు మైనర్, రెవెన్యూ డ్రెయిన్ల ద్వారా ప్రవహించి అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వైనతేయ నదిలోకి చేరుతుంది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన స్లూయిజ్ ఆటోమేటిక్ గేట్లు పూర్తిగా పాడయ్యాయి. దీంతో వరదలు వస్తున్న ప్రతిసారి అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వరద కుమ్మరి కాలువకు పోటెత్తడంతో వేలాది ఎకరాలను ముంచెత్తుతుంది. అల్లవరం మండలంలో బోడసకుర్రు, అల్లవరం, కోడూరుపాడు, అమలాపురం మండలంలో పేరూరు, కొంకాపల్లి, ఈదరపల్లి, జనుపల్లి, బండారులంక, అయినవిల్లి మండలాల్లో విలస, అయినవిల్లి, సిరిపల్లి, మడుపల్లి గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ముంపు నీరు స్తంభించి పంటలకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతుంది.

ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

గతేడాది ఆగస్టులో వైనతేయ నదికి వరదలు వచ్చినప్పుడు కుమ్మరికాలువ ద్వారా వరదనీరు ఎదురెక్కి వేలాది ఎకరాల్లో నారుమడులను ముంచెత్తింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను డ్రెయిన్ అధికారులతో కలసి పరిశీలించారు. దానికి ఉన్న ఆటోమేటిక్ గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని హెడ్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. వీటికి రూ.80 లక్షలతో ప్రతిపాదనలు చేసి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపించారు. ప్రతిపాదనలు చేసి పది నెలలు కావస్తున్నా నేటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

కొత్త షట్టర్ల ఊసే లేదు

గతేడాది జూలై 29న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులతో కలసి అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలించారు. పాడైన అవుట్ స్లూయిజ్ గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఏడాది కాలంగా కేవలం కంటి తుడుపుగా రూ.9.94 లక్షలతో మరమ్మతులు నిర్వహించి కొత్త షట్టర్ల ఊసే మరిచారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి వచ్చే వరదలకు తీవ్రంగా నష్టపోతున్నా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని రైతులు, బోడసకుర్రు గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త గేట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కుమ్మరికాలువలోకి వరద పోటెత్తడంతో జలమయమైన కాలనీలు (ఫైల్)

నిధులు మంజూరు కావాల్సి ఉంది

గోపాయిలంక వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ కొత్త షట్టర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఇటీవలే రూ.10 లక్షలతో మరమ్మతులు నిర్వహించాం. ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదు. వరదలు వస్తే మాత్రం ఇబ్బంది ఉంటుంది.

– దుర్గానాయుడు,
ఏఈ, హెడ్‌వర్క్స్, అమలాపురం

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్
- గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమం



దేవగుప్తం కర్రిచెరువులో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ'పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



గోపవరంలో క్యూఆర్ కోడ్ బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న కో ఆర్డినేటర్ శ్రీకాంత్, నాయకులు

ఉప్పలగుప్తం: ఎన్నికల్లో ప్రజలకు మోసపు హామీలిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు అండ్‌కో అధికారాన్ని దక్కించుకున్నారని అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కూనవరం, గోపవరం, కిత్తనచెరువు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ శ్రీకాంత్ గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్న హామీలను విస్మరించి మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్‌ను ఫోన్ ద్వారా స్కాన్ చేసి ఆ హామీలను ప్రజలకు వినిపించారు. సంక్షేమ పాలన అందించే జగనన్నకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనువాస్, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మీ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు బడుగు మేరీకుమారి, పొగాకు శ్రీను, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆకుల చిన్నీ, చిల్లా లక్ష్మణరావు, పార్టీ నాయకులు కుంచే స్వామి, కాట్రు కృష్ణ, ఆకుల బాలాజీ, దేవరపల్లి నాని, రాయుడు కేశవమూర్తి, గోడి కరుణాకర్, పండు రామదాసు, కోరుకొండ మంగాయమ్మ, కిరణ్, ఎన్.ఎస్.కుమార్, మోటూరి సత్యంకాపు, కుంపట్ల మహాలక్ష్మీనాయుడు, అయితాబత్తుల సూరిబాబు, అడపా రమేష్ పాల్గొన్నారు.

తల్లికి వందనంపై శ్వేతపత్రం విడుదల చేయాలి : ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్

అల్లవరం: అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చి గొప్పలు చెప్పుకునే మంత్రి నారా లోకేష్ ఆ పథకంపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లవరం మండలంలో రెండో రోజున ఎంట్రుకోన, దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ, 1.35 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో కనీసం ఒక సెంటు భూమినైనా పేదలకు ఇవ్వలేదని, ఒక్క ఉద్యోగం కల్పించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి బుద్ధి చెప్పే రోజు వస్తుందని ఎమ్మెల్సీ హెచ్చరించారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు తిక్కా వెంకట ప్రసాదు, జున్నూరి సుబ్బారావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, మాకే కృష్ణమూర్తి, గ్రామకమిటీ అధ్యక్షులు కుడుపూడి సూర్యప్రకాష్, వాసర్ల శ్రీను, పార్టీ నాయకులు నార్గన శ్రీను, వాసర్ల శ్రీమన్నారాయణ, సాపే సత్యనారాయణ, మల్లవరపు శ్రీను, తాతాజీ, పినమాల విక్రమ్, ఈతకోట సతీష్, పల్లి జయ, సాధనాల శ్రీను, బాల యోగి, పోతుమూడి శ్రీను, బళ్ల శివ, శేఖర్, గుర్రాల శ్రీనివాస్, బళ్ల రత్నకుమార్, బుంగ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం

- చైర్మన్ ప్రవీణ్, సభ్యుల వాకౌట్
- అర్ధంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం



సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న చైర్మన్ ప్రవీణ్, కౌన్సిల్ సభ్యులు

ముమ్మిడివరం: సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకంటూ వైఎస్సార్ సీపీ సభ్యులు అధికారుల తీరును ఎండగడుతూ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌తో సహా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేయడంతో కౌన్సిల్ సమావేశం అర్ధంతరంగా ముగిసింది. నగర పంచాయతీ సమావేశ మందిరంలో బుధవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలుత అజెండాలోని అంశాలు సమావేశంలో ప్రవేశ పెడుతుండగా 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ గత పల సమావేశాల్లో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చామని ఏఒక్క పరిష్కారం కాలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ అధికారులు తీసుకున్న చర్యలు వివరించాలన్నారు. దీనిపై కమీషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ బాధ్యులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. చైర్మన్ మాట్లాడుతూ పూర్తి వివరాలతో కౌన్సిల్‌కు సమాధానం చెప్పాలని కోరారు. ఆర్ఐ డి.రామమోహన్ వివరణ ఇస్తూ అక్రమ లేఅవుట్లు, పంట బోదెలు, డ్రెయిన్లు మూసి వేసిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు. అధికారులు చెప్పిన సమాధానాలపై చైర్మన్ ప్రవీణ్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థ నిద్రావస్థలో ఉందంటూ వారు విమర్శించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై అడిగితే తమను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చైర్మన్‌కే అధికారులు కనీస గౌరం ఇవ్వడంలేదని ప్రజా సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకంటూ ఆయనతోపాటు సహా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అజెండాలోని అంశాలు చర్చించకుండానే సమావేశం అర్ధంతరంగా ముగిసింది. వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి వేటుకూరి బోసురాజు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సత్కారం



గణేష్ వర్మను సత్కరిస్తున్న ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎక్కడ విష సర్పాలు కనిపించినా రాత్రి, పగలు అనే తేడాలేకుండా ఆ ప్రదేశానికి వెళ్లి వాటిని ఒడుపుగా పట్టుకుని సదూరంగా విడిచి పెట్టే స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ నిస్వార్థ సేవలు అభినందనీయమని అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ యర్రమల్లి విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గణేష్ వర్మ సత్కార సభలో ఆయన మాట్లాడారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ శశిధర్ స్నేక్ క్యాచర్ వర్మ సేవలను కొనియాడారు. ఇళ్లలోనూ, ఇళ్ల పరిసరాల్లోనూ పాములు కనిపిస్తే ఫోన్ నంబర్‌కు (9949956232) కాల్ చేస్తే వచ్చి ఉచిత సేవలు అందిస్తానని సత్కార గ్రహీత వర్మ స్పష్టం చేశారు. అనంతరం గణేష్ వర్మను అసోసియేషన్ తరపున ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్లు ఘనంగా సత్కరించి అభినందించారు. ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, నూలు సూర్య ప్రభాకరావు, శ్రీఘాకోళపు రాంపండు, నంబూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రీ సైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించాలి

యానాం: పారిశుధ్య పనులకు సంబంధించి రీ సోర్స్‌పార్క్‌లో డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ యూనిట్‌ను త్వరితగతిన ప్రారంభించాలని బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్‌కు విజ్ఞప్తి చేశారు. కనకాలపేట డంపింగ్ యార్డులో ఇంకా మిగిలిన ఉన్న చెత్తను రీ సైక్లింగ్ ద్వారా సాధ్యమైనంత త్వరగా తొలగించాలని కోరారు.

అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

అమలాపురం రూరల్: ఈదరపల్లి వంతెనకు ఇరు వైపులా పురపాలక సంఘం, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమన్వయంతో సుందరీకరణ చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పురపాలక సంఘం, రహదారులు భవనాల శాఖ ఏపీ ఈపీడీసీఎల్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి ఇటీవల నూతనంగా నిర్మించిన ఈదరపల్లి వంతెన ఎగువదిగువ సుందరీకరణ పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులతోపాటు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి రాము, ఏపీ ఈపీ డీసీఎల్ సూపరింటెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు తేదీల్లో రాత పరీక్షలు నిర్వహించాలి

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్వహించే ఉద్యోగ రాతపరీక్ష షెడ్యూలును మార్చాలని బుధవారం పలువురు అభ్యర్థులు సీఎం రంగసామి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు వినతిపత్రాలు అందజేశారు. ఆరోగ్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్ (అలోపతి), థియేటర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, మెటర్నటీ అసిస్టెంట్, ఈసీజీ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్షను ఒకే రోజు నిర్వహిస్తున్నట్లు షెడ్యూలు ప్రకటించారని వారన్నారు. చాలామంది అభ్యర్థులు పలు పోస్టులకు పోటీ పడుతున్నారని, పోస్టులవారీగా వేర్వేరు పరీక్ష తేదీల్లో రాత పరీక్షలను నిర్వహించాలని కోరారు. అభ్యర్థులు అడపా సంపత్‌కుమార్, పి స్వామి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జిప్‌మెర్‌లో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు సహకారం

యానాం: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థ జిప్‌మెర్ ఆసుపత్రిలో అత్యవసరంగా ఉపయోగించే విధంగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తానని బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం పుదుచ్చేరిలో జిప్‌మెర్ డైరెక్టర్ వీర్‌సింగ్‌ను కలసి మాట్లాడారు. యానాం ఓల్డేజ్‌హోమ్ బ్లడ్ బ్యాంక్‌లో ఉన్న యంత్రాల్ని ఉచితంగా జిప్‌మెర్‌కు సమకూర్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు విధానంలో నియమితులైన సిబ్బంది యూనిఫామ్ కోసం రూ.5వేలు వసూలు చేసిన వ్యక్తులు, ఇప్పుడు మరో రూ.50వేలు తీసుకురావాలని అడుగుతున్నారని పలువురు నర్సులు డైరెక్టర్ వీర్‌సింగ్ సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మల్లాడి కోరారు.

జోనల్ స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

యానాం: పట్టణ పరిధిలో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జోనల్ స్కూల్ గేమ్స్–2025–26లో భాగంగా బుధవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అండర్–17 క్రీడాకారులు మొత్తం 14 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో ఎస్‌టీపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ద్వితీయస్థానంలో రీజెన్సీ కళాశాల, తృతీయస్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ హైస్కూల్ జట్లు నిలిచాయి. విద్యాశాఖ సూపరింటెండెంట్ ఉందుర్తి శ్రీనివాస్, అసిస్టెంట్ కె శ్రీనివాస్, యూడీసీ వంశీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రడీమేడ్ సామగ్రితో కార్పెంటర్ల ఉపాధికి గండి



ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న కార్పెంటర్ చేతి వృత్తుల సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: మార్కెట్లోకి రడీమేడ్ గుమ్మాలు, కిటికీలు తదితర గృహోపయోగ సామగ్రి వచ్చి తమ ఉపాధిని దెబ్బ తీస్తున్నాయని జిల్లా కార్పెంటర్ చేతి వృత్తుల సేవా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనాయణమూర్తి అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో కార్పెంటర్ల సమస్యలపై ఆర్డీవోకు బుధవారం వినతిపత్రం అందించి జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు సమస్యలను వారు ఆర్డీవోకు వివరించారు. 50 ఏళ్లు దాటిన చేతి వృత్తుల వారికి ప్రభుత్వం నుంచి పింఛన్ సౌకర్యం కల్పించాలని జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి అభ్యర్థించారు. ఆర్డీవోకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీ రావు, కుసుమే నరసింహరాజు, యాలంగి రామకృష్ణ, పాలమూరు రామకృష్ణ పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



వసతి గృహంలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ముమ్మిడివరం: మండలంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు చైతన్య ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు మెండగుదిటి శిరీష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు గంటి ఆకాష్ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి ఉంగరాల సంతోష్, దొమ్మేటి అర్జున్, బూలా పృథ్వీ, పందిరిపల్లి రాజేష్, కాశి భరత్ పాల్గొన్నారు.

ఘనంగా కమిడి ప్రవీణ్ పుట్టిన రోజు వేడుక

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో ప్రవీణ్ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పెన్మత్స చిట్టిరాజు, రెడ్డి హేమసుందరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తూడు తొలగింపునకు నిధుల మంజూరు

తాళ్లరేవు: మండల పరిధిలోని పంట కాలువలు, ఊట కాలువల్లో తూడు, చెత్త చెదారాలు తొలగించేందుకు రూ.38 లక్షలు మంజూరైనట్లు ఇరిగేషన్ ఏఈ ఉద్దీశ అనూష తెలిపారు. బుధవారం పోలేకుర్రు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నీటి సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ఏడాదిపాటు పంట కాలువల్లో తూడు తొలగించేందుకు రూ.20 లక్షలు, ఊటకాలువల్లో తూడు తొలగించేందుకు రూ.18 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. రైతులు దున్నా జనార్దన రావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రెడ్డి ప్రసాద్, నీలపల్లి నీటి సంఘం అధ్యక్షుడు ధూళిపూడి గోపాలరావు(గోపి) పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామ సచివాలయం- 1, సచివాలయం-2లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ ప్రశంసించారు. బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం పంచాయతీలో సర్పంచ్ అరుణ కుమారి చంద్రశేఖర్ అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి ఆర్ఎస్ ఎస్ సూరపురాజు తదితరులు పాల్గొన్నారు. గున్నేపల్లి అగ్రహారం సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగులను సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

అమలాపురం టౌన్: రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వీరబ్రహ్మం అమలాపురంలో బుధవారం పర్యటించారు. ఆయన జిల్లాలోని బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులను కలిసి ఉద్యోగుల భద్రతపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, ఉమ్మడి తూర్పు గోదావరి బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.